## క్లుప్తంగా

### వ్యవసాయ అధికారిగా రాజ్‌కుమార్ నియామకం



**కొయ్యూరు:** మండల వ్యవసాయ అధికారిగా బి.రాజకుమార్‌ను నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఆయన జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ సాంకేతిక నిపుణులుగా పనిచేస్తున్నారు. అతనిని కొయ్యూరు ఏవోగా బదిలీ చేశారు. ఇక్కడ ఏవోగా చేసిన ప్రియాంకను జిల్లా వ్యవసాయ కార్యాలయంలో సాంకేతిక వ్యవసాయ అధికారిగా నియమించారు.

### విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో రాంబాబు

**కొయ్యూరు:** మండలంలోని రత్నంపేట ఎంపీపీ పాఠశాలను ఎంఈవో ఎల్.రాంబాబు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని కోరారు.చదువుతో పాటు ఆటల్లోను రాణించాలన్నారు. వంట చేసే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు.

### ఆత్మరక్షణ అవసరం



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి

**పాడేరు రూరల్:** ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరికి కరాటే, త్వైకాండో వంటివి ఎంతో అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టబ్బాయి తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. కరాటే అకాడమి చీఫ్ పాండురాజు, కరాటే ట్రైనర్లు అప్పన్న, సురేష్, సూర్యప్రకాష్, వెంకట్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్

**అరకులోయటౌన్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని ఈనెల 16న నిర్వహించనున్న నేపథ్యంలో రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ కె. భరత్ కుమార్‌నాయక్ మాట్లాడుతూ ఓజోన్ పరిరక్షణలో భాగంగా అందరూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు ఈనెల 16న బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. అధ్యాపకులు అనిత కుమారి, సురేష్, గణేష్, వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ పి.కొండబాబు, ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, విజయలక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో పందిరాట ఉత్సవం



పందిరి రాట వేస్తున్న సర్పంచ్ రాంబాబు, గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు

**జి.మాడుగుల:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం జంక్షన్ వద్ద ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా బుధవారం భక్తిశ్రద్ధలతో పందిరి రాట ప్రతిష్ఠోత్సవం జరిగింది. సర్పంచ్ కిముడు రాంబాబు, గ్రామ పెద్దలు, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దసర ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్ణయించింది. ఈ ఏడాది కాళీ మాత అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలను ప్రజలు, భక్తులు విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ కోరింది

# పడకేసిన పారిశుధ్యం

- రోజులతరబడి పేరుకుపోయిన చెత్త
- దుర్గంధంతో స్థానికులు సతమతం
- పట్టించుకోని యంత్రాంగం



ఏపీ టూరిజం పున్నమి వ్యాలీ రిసార్ట్స్ ఎదురుగా ప్రధాన రహదారిలో పేరుకుపోయిన చెత్త



శరభగుడ వెళ్లే మార్గంలో చెత్త కుప్పలు

**అరకులోయటౌన్:** గ్రామాల్లో పారిశుధ్యం కొరవడింది. ప్రధాన రహదారులు, వీధుల్లోనూ ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రకటనలకే పరిమితమైందని పలువురు చెబుతున్నారు. పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేక రోజుల తరబడి చెత్తకుప్పలు ఉంటున్నాయి. తీవ్ర దుర్గంధంతో స్థానికులు సతమతమవుతున్నారు.

**ముక్కుమూసుకోవాల్సిందే**

ప్రతీ రోజు పురవీధుల్లో సేకరించిన చెత్తను సంపద



అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్ గెస్ట్ హౌస్ రహదారి వద్ద పేరుకుపోయిన చెత్త

తయారీ కేంద్రాలకు తరలించి, తడి, పొడి చెత్త వేరు చేసి, చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. అయితే చెత్త నుంచ సంపద తయారీ పక్కన పెడితే పంచాయతీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా స్థానికులు, పర్యాటకులు ముక్కుమూసుకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ మండల కేంద్రంలో ప్రధాన రహదారులకు సమీపంలోనే ఉండే వీధుల్లో చెత్త చెదారం గురించి పట్టించుకోవడంలేదని పలువురు చెబుతున్నారు. దుర్వాసనతో రాత్రి , పగలు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు ఉదాహరణ అరకులోయలోని ఎన్టీఆర్ గార్డెన్ సమీపంలోని అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్ క్రీడా మైదానం రహదారి, శరభగుడ రహదారితోపాటు ఏపీ టూరిజం పున్నమి వ్యాలీ రిసార్ట్స్ ఎదురుగా అరకు – విశాఖ ప్రధాన రహదారిలో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. సమీపంలోనే హోటల్‌లు, లాడ్జిలలో ప్రతీ రోజు పర్యాటకులు బసచేస్తున్నారు. ఈ రహదారి మీదుగా పాఠశాలకు విద్యార్థులు వెళ్తుంటారు. రోజుల తరబడి చెత్త తొలగించడం లేదంటున్నారు. వర్షాలు కురుస్తుండడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారిందని చెబుతున్నారు. దోమలు పెరిగి కంటి మీద కునుకు ఉండడం లేదంటున్నారు. రోగాలు ప్రబలే అవకాశాలున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని, గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలని వారు కోరుతున్నారు.

### అధికారులు స్పందించాలి

రోజూ అరకులోయ పట్టణంలో చెత్త సేకరిస్తున్న కార్మికులు వీధుల్లో చెత్త తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామస్తులతో పాటు, పర్యాటకులు రాకపోకలు సాగించే వారంతా తీవ్ర ఇబ్బందులు పడి, ముక్కుమూసుకోని వెళ్లాల్సిన పరిస్థితి. పంచాయతీ అధికారులు స్పందించి ప్రతీ రోజు పురవీధుల్లో చెత్త సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలి.

– కామేశ్వరరావు, స్థానికుడు, అరకులోయ

# ఉపాధి అవకాశాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రవీంద్ర

**సీలేరు:** సీలేరు పోలీస్ స్టేషన్లో పరిధిలో సీలేరు.దుప్పులవాడ. దారకొండ, గుమ్మరేవుల, అమ్మవారి దారకొండ గ్రామాల్లో ఎస్ఐ రవీంద్ర బుధవారం పర్యటించారు. గ్రామాల్లోని యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టులో ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలైందని, ఇంటర్, డిప్లమో, ఐటీఐ ఎలక్ట్రీషియన్ కోర్సులు చదివిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థుల బయోడేటాలను పూర్తి చేసి దరఖాస్తు చేస్తామని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ రవీంద్ర కోరారు. రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అంబుజా సిమెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలపై బుధవారం అవగాహన కల్పించారు. కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. అంబుజా సిమెంట్ ఫౌండేషన్ సిబ్బంది తులసిరామ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ, కన్వీనర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 150 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

**కూనవరం:** కూటూరు పీహెచ్‌సీ పరిధిలోని గబ్బిలాల గొంది, పాత కారుమానుకొండ, కొత్త కారుమానుకొండ, చింతగండి తదితర గ్రామాల్లో ఓంకార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాసమూర్తి సుమారు 150 మందికి రోగులకు వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు, పాలు, రొట్టెలు అందజేశారు. ఓంకార్ ట్రస్ట్ సభ్యులు చిచ్చడి రాజేష్ మాట్లాడుతూ ట్రస్ట్ చైర్మన్ ఎన్‌బి బాలస్వామి ఆదేశాల మేరకు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. హెల్త్ అసిస్టెంట్ అర్జున్, ఏఎన్ఎం అరుణ, ఆశ వర్కర్లు దీపిక, సీత, ట్రస్ట్ నుంచి రాజేష్, శ్రీను, ఆనంద్, శ్రీలత, సోము తదితరులు పాల్గొన్నారు.

### తెగుళ్లపై అప్రమత్తం

**జి.మాడుగుల:** గిరిజన ప్రాంతాల్లో గల కాఫీ తోటల్లో ఇటీవల వ్యాప్తి చెందుతున్న బెర్రీ బోరర్ తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ పలాసి కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు రామారావు, కాఫీ లైజన్ వర్కర్ జగదీష్ పాత్రుడు తెలిపారు. మండలంలో కె.కోడాపల్లి, కుంబిడిసింగి పంచాయతీల్లో బుధవారం బెర్రీ బోరర్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కాఫీ పంటకు తెగుళ్ల లక్షణాలు కన్పిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. సీడీపీవో బాలదేవి, సిబ్బంది వెంకట్, మోహన్,వీవో మత్స్యలింగం, రైతులు పాల్గొన్నారు.

# భైరాగి మృతికి సంతాపం



భైరాగి పార్థీవదేహం వద్ద నివాళులర్పిస్తున్న అరకు ఎంపీ తనూజరాణి, వినయ్ దంపతులు, అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

**హుకుంపేట:** మండలంలోని అడ్డుమండ సర్పంచ్ గుమ్మా శ్యామ్‌సుందర్ తండ్రి, అరుకు ఎంపి డాక్టర్ తనూజరాణి తాతయ్య గుమ్మా భైరాగి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ తనూజరాణి , వినయ్ దంపతులు, అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణలు అడ్డుమండ గ్రామానికి చేరుకుని భైరాగి పార్థీవదేహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ తనూజరాణి మాట్లాడుతూ తాను ఉన్నత విద్య అభ్యసించేందుకు తన తల్లిదండ్రులతో పాటు తన తాతయ్య ఎంతో ప్రోత్సాహం ఇచ్చారని గుర్తు చేశారు. భైరాగి మృతిపై ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలు, అధికారులు పెద్ద ఎత్తున తరలివచ్చిన నివాళులర్పించారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



దుంబ్రిగుడలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు



హుకుంపేటలో రాష్ట్ర అవార్డు గ్రహీత టీచర్ సత్యరావును సన్మానిస్తున్న సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు

**దుంబ్రిగుడ:** మండలంలోని ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పి.ధర్మ, రాజ్‌కుమార్‌లకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు లభించాయి. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్షుడు శెట్టి బాలకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కన్నయ్య మాట్లాడుతూ మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు అవార్డులు రావడం హర్షణీయమన్నారు. వారికి అభినందనలు తెలిపారు. సుబ్బారావు, సత్యనారాయణ, మోహన్ పాల్గొన్నారు.

**హుకుంపేట:** మండలంలోని మత్స్యపురం పంచాయతీ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మోస సత్యారావు ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సహచర ఉపాధ్యాయులు తదితరులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్, టీఎస్సార్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు తెడబారికి సురేష్‌కుమార్ మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు ఉంటుందన్నారు. మాజీ ఎంపీటీసీ చిన్నబ్బి, ఉపాధ్యాయులు ప్రభాకర్, తౌడంనాయుడు, నాయకుడు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఏఎస్పీకి వినతి



ఏఎస్పీ నవజ్యోతిమిశ్రాకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**సీలేరు:** దారకొండ మండల కేంద్రంగా ప్రకటించేందుకు సహకరించాలని చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రాను దారకొండ మండల కేంద్ర సాధన సమితి నాయకులు బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. దారకొండ మండల కేంద్రమైతే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. సీలేరు రోడ్డు పూర్తిస్థాయిలో అభివృద్ధి జరిగేలా సంబంధిత అధికారులతో మాట్లాడాలని కోరారు. నాయకులు జగన్, సుందరయ్య, విష్ణుమూర్తి, రాంబాబు, రాజు, రాము తదితరులున్నారు.

### 17న మండల సమావేశం

**వై.రామవరం:** మండల సర్వసభ్య సమావేశం ఈనెల 17న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర చెప్పారు. ఎంపీపీ కడబాల ఆనంద రావు అధ్యక్షతన బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. సమావేశానికి అధికారులు పూర్తి సమాచారాలతో రావాలని సూచించారు.

# గ్రామాల్లో సమస్యలపై వినతులు



అరకు ఎమ్మెల్యే మత్స్యలింగకు వినతిపత్రం అందజేస్తున్న నాయకుడు నరసింగరావు



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**దుంబ్రిగుడ:** మండలంలోని సొవ్వ పంచాయతీ కమలబంధ, సాగిరివలస గ్రామాల రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు పాంగి నరసింగరావు తదితరులు బుధవారం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొవ్వ పంచాయతీ మలబంధ, సాగిరివలస గ్రామాల రోడ్డు సమస్యను పరిష్కరించాలని, గ్రామాల్లో ఎవరైనా అనారోగ్యనికి గురైనా, అంబులెన్స్ వెళ్లడానికి వీలు లేకుండా ఉందని, జన్‌మన్ గృహాల నిర్మాణం కోసం ఇసుక, కాంక్రీట్, సిమెంట్ వంటి సామగ్రి తరలింపునకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించామన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మత్స్యలింగం సంబంధిత రాజ్ డీఈఈతో ఫోన్ ద్వారా మాట్లాడి రోడ్డు సమస్య పరిష్కరించాలని ఆదేశించారన్నారు. డీఈఈ మాట్లాడుతూ గ్రామానికి రహదారి పనులు కొంత జరిగాయని, నిధులు లేక పనులు నిలిచిపోయాయని, కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ప్రతిపాదనలు పంపామని ఆయన ఎమ్మెల్యేకు వివరించారన్నారు. ఈ రోడ్డు నిర్మాణంపై కలెక్టర్ దృష్టికి మరోసారి గ్రామస్తులు విన్నవిస్తే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉందని డీఈఈ పేర్కొన్నట్టు తెలిపారు.

**దుంబ్రిగుడ:** మండలంలోని పోతంగి పంచాయతీ పరిధిలోని 36 గ్రామాలకు సీసీరోడ్లుతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి మఠం శంకర్ పంచాయతీ కార్యదర్శి గౌతమికి వినతిపత్రాన్ని అందజేశారు. సీసీ రోడ్డు, వీధిదీపాలు లేక గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి గౌతమి మాట్లాడుతూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామి ఇచ్చారు.

# అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం



కూటమి నాయకులతో వాగ్వాదపడుతున్న వైస్ ఎంపీపీ సుధాకర్ తదితరులు

**చింతూరు:** స్థానిక గ్రామ సచివాలయంలో బుధవారం స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియలో ప్రోటోకాల్ రగడ చోటు చేసుకుంది. ప్రజా ప్రతినిధులకు గౌరవం ఇవ్వకుండా కూటమి నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడంపై వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీపీ సవలం అమల, వైఎస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్ అధికారుల తీరును దుయ్యబట్టారు. కార్యక్రమానికి పిలిచి తమను కనీసం పట్టించుకోలేదని తీవ్రంగా అవమానించారంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులైన ఎంపీపీ, వైస్ ఎంపీపీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా సభాస్థలిపై కూటమి నాయకులను కూర్చోబెట్టడంపై వారు అధికారుల తీరుపై మండిపడ్డారు. ప్రసంగం విషయంలో కూడా తమకు అవకాశమివ్వకుండా కూటమి నాయకులతో మాట్లాడించడం ప్రోటోకాల్ ఉల్లంఘనేనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని, ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తహసీల్దార్ సయ్యద్ హుస్సేన్, ఈవోపీఆర్డీ మోహన్, కార్యదర్శి జగన్మోహనరావు, వీఆర్వో రామచంద్రం, నాయకులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పరామర్శ



అనాథ బాలుడు సూర్యదీక్షిత్‌తో ఎమ్మెల్యే శిరీషదేవి

**రాజవొమ్మంగి:** మండలంలోని లాగరాయి గ్రామంలో జ్వరానికి చికిత్స పొందుతూ మృతి చెందిన జగజనని కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే శిరీషా బుధవారం పరామర్శించారు. తల్లి మృతితో అనాథగా మిగిలిన సూర్యదీక్షత్‌ను పదో తరగతి వరకు చదివిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. అంత్యక్రియల ఖర్చు నిమిత్తం రూ.10వేలు అందజేశారు.

# దోమల నివారణకు చర్యలు



పూతిగుంట గ్రామ చెరువులో గంభూషియ చేపలను వదులుతున్న వైద్యాధికారి శ్రావణి, సిబ్బంది

**వై.రామవరం:** దోమల నివారణలో భాగంగా మండలంలోని పూతిగుంట గ్రామ చెరువులో చవిటి దిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.వి.శ్రావణి ఆధ్వర్యంలో గంభూషియా చేపలను బుధవారం వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు చవిటి దిబ్బలు పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామా ల్లోను విడతల వారీగా నీరు నిలవ ఉండే చెరువుల్లోను ఈ చేపలను వదులుతామన్నారు. నీటిలో ఉండే దోమల లార్వాను ఈ చేపలు తిని వేయడంతో దోమలు వృద్ధి చెందవన్నారు. దీంతో దోమలు వలన సోకే మలేరియా, డెంగ్యూ తదితర జ్వరాలను పారదోలవచ్చునన్నారు. దోమల నివారణకు ఈగంభూషియా చేపలు ఎంతో దోహదపడతాయన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్‌యూవో అశోక్‌కుమార్, ఎంటీఎస్ పి.కృష్ణారెడ్డి, పీహెచ్ఎన్ రత్నకుమారి, హెచ్‌వీ లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

**చింతపల్లి:** స్థానిక ఏరియా ఆస్పత్రిలో బుధవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి నర్సింగ్ సూపరింటిండెంట్ పద్మావతి మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించార. హెడ్ నర్స్, స్టాఫ్ నర్స్ వసంత తదితరులు పాల్గొన్నారు.

### ఆరోపణలు అవాస్తవం

**జి.మాడుగుల:** తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వంజంగిపాడు పీసా కమిటీ ఉపాధ్యక్షులు లకే రామకృష్ణ చెప్పారు.ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఏ శాఖ సిబ్బంది, గిరిజనేతరుల నుంచి డబ్బులు వసూలు చేయలేదని, సర్పంచ్‌లు చేస్తున్న ఆరోపణలు అవాస్తమన్నారు. తనపై వచ్చిన తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు.

### భక్తులకు అన్నసమారాధన

**సీలేరు:** వినాయక చవితి వేడుకల్లో భాగంగా సీలేరులోని అయ్యప్ప ఆలయంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**పాడేరు రూరల్:** వినాయక చవితి వేడుకల్లో భాగంగా పాడేరు పాత బస్టాండ్ వద్ద భక్తుడు డోకుపార్తి రామకృష్ణ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో బుధవారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు, భక్తులు భారీగా తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు నిర్వాహకులు తెలిపారు.

### అంగన్‌వాడీల సమస్యలపై పోరాటం

**పాడేరు:** ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకులు పద్మ, శోభ పర్యవేక్షణలో బుధవారం పాడేరులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షురాలిగా డి.నాగమ్మ, ప్రధాన కార్యదర్శి కె. భాగ్యలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కళావతి, కోశాధికారిగా చిన్నారి, సహాయ కార్యదర్శులుగా కొండమ్మ, సత్యవతి, మోదకొండమ్మ, ఉపాధ్యక్షులుగా వసంత, ఈశ్వరమ్మ, నిర్మల, ఇందుమతి, సుమిత్ర, మోదకొండమ్మలతో మరో 11 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు.

### చింతపల్లి జెడ్పీటీసీకి అస్వస్థత

**కొయ్యూరు:** చింతపల్లి జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య బుధవారం సాయంత్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయనకు బీపీ తక్కువ కావడంతో రాజేంద్రపాలెం ఆస్పత్రిలో వైద్య సిబ్బంది చికిత్స అందించారు.

### పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

**చింతపల్లి:** శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా మండల కేంద్రంలో బుధవారం పారిశుధ్య పనులను డిప్యూటీ ఎంపీడీవో సీతామహాలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. దుకాణదారులు తడి,పొడి చెత్తను వేర్వేరుగా ఉంచి, పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. విచ్చలవిడిగా చెత్తను రోడ్లు, డ్రైనేల్లో వేస్తే జరిమానా విధిస్తామన్నారు. పారిశుధ్య మెరుగునకు సిబ్బందికి సహరించాలన్నారు. కార్యదర్శి లక్ష్మికుమార్, సీనియర్ అసిస్టెంట్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

### ఆదికర్మ యోగి అభియాన్‌తో గ్రామాల అభివృద్ధి

**ముంచంగిపుట్టు:** మండల కేంద్రంలో ఆదికర్మయోగి అభియాన్‌పై పంచాయతీ కార్యదర్శి సింహాచలం ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదికర్మయోగి అభియాన్‌తో గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి నోచుకోని, అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. కించాయిపుట్టు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**రంపచోడవరం:** కుంజంవీధి గ్రామంలో ఆదికర్మయోగి అభియాన్ కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మిలు బుధవారం పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ఆదికర్మ యోగి అభియాన్ ఎంతో దోహదపడుతుందన్నారు.సర్పంచ్ చెదల దేవీ పాల్గొన్నారు.

### రాజ్‌మా విత్తనాల పంపిణీ

**దుంబ్రిగుడ:** మండల కేంద్రంలోని పోతంగి పంచాయతీ రైతు సేవ కేంద్రంలో బుధవారం రాజ్‌మా విత్తనాలను సర్పంచ్ వంతాల వెంకటరావు పంపిణీ చేశారు. సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు తదితరులు పాల్గొన్నారు.

### విత్తనశుద్ధి తప్పనిసరి

**జి.మాడుగుల:** మండలంలో సుర్మతి పంచాయతీ వాకపల్లి గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధ్వర్యంలో రాజ్‌మా పంట సాగుపై మండల వ్యవసాయ శాఖాధికారి కె.వరప్రసాద్ బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సాగుకు ముందు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. సేద్య పద్ధతుల పాటించి, తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎంపీఈవో ప్రశాంత్‌కుమార్, ఉదయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

### యూరియా వినియోగంపై రైతులకు అవగాహన

**సీలేరు:** మండంలోని దారకొండలో రైతులతో ఏవో గిరిబాబు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల సూచనల మేరకు పంటల సాగు చేయాలన్నారు. యూరియాను తగిన మోతాదులో వినియోగించాలని సూచించారు. మండలంలో యూరియా అందుబాటులో ఉందన్నారు. పంటల సాగుపై రైతులు మెలకువలు తెలుసుకోవాలని వాతావరణ అనుకూలంగా వ్యవసాయం చేయాలన్నారు.

### రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

**రంపచోడవరం:** ఉత్పత్తిదారులు, కొనుగోలుదారుల ఒప్పందాలతో రైతులకు మేలు జరుగుతుందని పీహెచ్‌ఓ దేవదానం అన్నారు. రంపచోడవరంలో బుధవారం హిపర్, ,నవజీవన్ ఆర్గనైజేషన్ ద్వారా హెచ్‌హెచ్ఏఐబీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరిగిన ఉత్పత్తిదారులు, కొనుగోలుదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు మంచి గిట్టుబాటు ధర కల్పించినప్పుడే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నవజీవన్, హిపర్ రైతుల సాధికారతకు కృషి చేస్తుందని హిపర్ ఏపీ హెడ్ శ్యామ్‌కుమార్ కట్ట అన్నారు. ఎఫ్‌పీవో డైరెక్టర్లతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.